క్లుప్తంగా

పెద్దమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటాం

నంద్యాల(న్యూటౌన్): చిరు, వీధి వ్యాపారుల సమస్యలను పరిశీలించి వారి జీవనోపాధి దెబ్బతినకుండా వారికి అండగా ఉంటామని మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఆదివారం చిన్న, వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మంత్రికి కేంద్ర వీధి వ్యాపారుల జీవనోపాధి రక్షణ చట్టం 2014 ప్రతిని అందజేశారు. వీధి వ్యాపారుల ప్రయోజనాలను కాపాడాలని, టౌన్ వెండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ.. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా, వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీలో మంగళవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరై నంద్యాల మున్సిపాలిటీలోని సమస్యలు, అభివృద్ధిపై జరిగే చర్చలో పాల్గొనాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

అయోడిన్ ఉప్పునే వినియోగించాలి

నంద్యాల(వ్యవసాయం): ఆహార పదార్థాల్లో అయోడిన్ కలిగిన ఉప్పును మాత్రమే వాడాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు రాముడు, కాశీంవలి సూచించారు. ఆదివారం నూనెపల్లె నర్స్ క్వార్టర్స్‌లోని సత్య సమీక్ష కేంద్రంలో శ్రీవాసవీ రిటైల్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అయోడిన్ లోపాల వ్యాధుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాపారులకు ఫుడ్‌సేఫ్టీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండెడ్ యాక్ట్ ప్రకారం అయోడిన్ కలిగిన ఉప్పునే విక్రయించాలని, ఇటువంటి వాటినే వినియోగదారులకు అమ్మాలని సూచించారు. అయోడిన్ లేని ఉప్పు వాడటం వల్ల గాయిటర్, థైరాయిడ్, బుద్ధి మాంద్యం, పుట్టబోయే పిల్లలకు ఎదుగుదల ఉండదని చెప్పారు. అధికారులు రాముడు, రిటైల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రజనీకాంత్, మేడం విజయ్, రవికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


అమృత

శిరివెళ్ల: రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి అమృత రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు ఎంపికైంది. ఈ నెల 24వ తేదీ నంద్యాలలోని నంది ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపి క పోటీల్లో విద్యార్థిని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు తరఫున ఎంపికైందని హెచ్ఎం తిరుపతి రెడ్డి, పీఈటీ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. విద్యార్థిని ఎంపికపై ఉ పాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 7 గంటలకు క్యూలైన్లు నిండిపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. సాయంత్రం 4గంటల వరకు కూడా క్యూలైన్‌లు నిండుగానే ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- గుంతల మయంగా మారిన రహదారిపై వాహనదారుల అవస్థలు
- దూరమైనా చుట్టూ తిరిగి వెళ్తున్న వైనం
- పట్టించుకోని పాలకులు

రహదారి అధ్వానం.. రాకపోకలకు అంతరాయం

రుద్రవరం: రుద్రవరం మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. భారీ వర్షాలకు, వాహనాల రాకపోకలతో రహదారులు దెబ్బతిని గుంతల మయం అయ్యాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఛిద్రమైన రోడ్లపై రాక పోకలు సాగించలేక చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా అధికారులు, పాలకులు ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి

అధ్వానంగా మారిన రోడ్లు..

☛ మండల కేంద్రమైన రుద్రవరం నుంచి శిరివెళ్ల మీదుగా నంద్యాలకు వెళ్లేందుకు ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. ఈ రోడ్డు చిన్నకంబలూరు మెట్ట నుంచి శిరివెళ్ల వైపు 2 కి.మీ మేర పూర్తిగా దెబ్బతిని గుంతల మయం అయ్యింది. ఈ దారిలో వాహనాలు రాక పోకలు సాగిస్తే ఆయా వాహనాల విడి భాగాలు ఎక్కడ ఊడి పడితాయో అన్న చందంగా ఉండటంతో వాహనదారులు భయంతో అటువైపు వెళ్లడం మానేశారు. కాస్త దూరమైన రుద్రవరం నుంచి ఎర్రగుడిదిన్నె మీదుగా జాతీయ రహదారిపైకి చేరుకొని అక్కడి నుంచి నంద్యాలకు వెళ్తున్నారు.


రాక పోకలకు వీలులేకుండా మారిన బి.నాగిరెడ్డిపల్లె-పేరూరు రోడ్డు


ఇరువైపులా మూసుకు పోయిన పెద్దకంబలూరు-శ్రీరంగాపురం రోడ్డు

☛ రుద్రవరం నుంచి పెద్దకంబలూరు మీదుగా డీ.కొట్టాల, శ్రీరంగాపురం గ్రామాలకు వెళ్లే దారి పొలాల మధ్య ఉండటంతో ఇరువైపులా మూసుకు పోయింది. కేవలం ఎడ్ల బండి మాత్రమే రాక పోకలు సాగించేందుకు వీలుగా ఉంది. ప్రస్తుతం వర్షాలు కురిసి ఆ దారి వెంట నీరు నిల్వ ఉంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్క జొన్న పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. అయితే అటు వైపు నుంచి ధాన్యం దిగుబడులను ఇళ్లకు చేర్చుకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు.

☛ బి.నాగిరెడ్డిపల్లె నుంచి పేరూరు వేళ్లే దారి నరకానికి నకలుగా మారింది. మెటల్ రోడ్డే అయినప్పటికీ మరమ్మతులకు నోచుకోక బాగా దెబ్బతింది. ఉద్యోగులు, ప్రజలు ఆ గ్రామాల మధ్య రాకపోకలు సాగించలేక పక్క గ్రామాల మీదుగా వెళ్తున్నారు.

☛ ముత్తలూరు-నల్లవాగుపల్లె మధ్య దారి అధ్వానంగా ఉంది. ఇవే కాక పెద్దకంబలూరు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఉన్నత పాఠశాలకు వేళ్లేదారి, చిత్రేనిపల్లెలో నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి ఛిద్రమయ్యింది. వర్ష కాలంలో ఈ రోడ్లపై బడికి వెళ్లి వచేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక అంతర్గత రోడ్ల పరిస్థితి చెప్పనలవి కాదు.

నొప్పుల మాత్ర వేసుకోవాల్సిందే



కొండమాయపల్లె పంచాయతీ పేరూరు గ్రామ సచివాలయం పరిధిలో ఉంది. ఏవైనా ధ్రువ పత్రాలు,ఎరువులు కొనుగోలు చేయాలన్న, వ్యవసాయ శాఖ సిబ్బందితో సలహాలు, సూచనలు తీసుకోవాలన్న తప్పని సరిగా బి.నాగిరెడ్డిపల్లె మీదుగా పరూరుకు వెళ్లాలి. ఆ దారిన వెళ్లి ఇంటికి చేరుకోగానే నొప్పులు తగ్గేందుకు మాత్ర వేసుకోవాల్సిందే. కారణం రోడ్డంతా గుంతల మయం,నీరు నిల్వ ఉంటూ ఎక్కడ ఎంత గుంత ఉందో తెలియక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆ రోడ్డు వేస్తే ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

– వెంకటరామిరెడ్డి, రైతు, కొండమాయపల్లె

చుట్టూ తిరిగి వెళ్తున్నాం



శ్రీరంగాపురం నుంచి డి.కొట్టాల మీదుగా రోడ్డు నిర్మిస్తే శ్రమ, దూరం తగ్గు తుంది. ప్రస్తుతం మండల కేంద్రానికి వెళ్లాలంటే ఎల్లావత్తుల మీదుగా చి న్నకంబలూరు, కొండమాయపల్లె వైపు నుంచి చుట్టు తిరిగి వెళ్తన్నాం. దీంతో దూరం పెరగడంతో పాటు అలసట వస్తోంది. అలా కాకుండా డి..కొట్టాల వైపు రోడ్డు వేస్తే ప్రజలకు, రైతులకు ఉపయాగకరంగా ఉంటుంది.

– మధు, శ్రీరంగాపురం

ఉర్దూ కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(రూరల్): నంద్యాలో ఉర్దూ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటకు కృషి చేస్తామని, కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో అల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) వ్యవస్థాపకులు సయ్యద్ ఉశేన్ అధ్యక్షతన జిల్లా వార్షిక మహాసభ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి హాజరయ్యారు. ఆల్‌మేవా రాష్ట్ర సలహాదారుడు అబులైజ్, జిల్లా అధ్యక్షులు సయ్యద్, ఇమ్రాన్ బాషా పాల్గొన్నారు.

మహదేవపురంలో కార్డన్ సెర్చ్


ఓ ఇంట్లో సోదా చేస్తున్న పోలీసులు

శిరివెళ్ల: మండలంలోని మహదేవపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది కలిసి గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానితులు, నాయకుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామంలో కవాతు నిర్వహించి ప్రజలు ఎటువంటి నేరాలకు పాల్పడరాదని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ వంశీధర్ ప్రజలకు సూచించారు. అనంతరం ఎటువంటి రికార్డులు లేని 18 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న త్రీటౌన్ సీఐ సూర్యమౌళి

నంద్యాల(సిటీ): పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని త్రీటౌన్ సీఐ సూర్యమౌళి హెచ్చరించారు. ఆదివారం స్థానిక నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ పట్టణంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలో రౌడీ మూకలను అరికట్టి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూస్తామన్నారు. నేరాలు, దౌర్జన్యాలు, అక్రమాలు, బెదిరింపులకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తీవ్ర పరిణామాలు తప్పవని స్పష్టం చేశారు. రౌడీషీటర్లంతా ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్‌లో సంతకాలు చేసి వెళ్లాలని ఆదేశించారు. అనంతరం సదరు వ్యక్తులంతా ఏయే వృత్తులలో ఉన్నారో వివరాలు నమోదు చేసుకున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


ఉయ్యాలవాడలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ఉయ్యాలవాడ : గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేశ్వర్లు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాలలో ప్రజలు ప్రశాంతంగా జీవనాన్ని కొనసాగించాలన్నారు. ఎక్కడైనా అలజడులు సృష్టించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చినా, ప్రజలు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

దొర్నిపాడు: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు ప్రతి ఆదివారం స్టేషన్‌లో హాజరు కావాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని నంద్యాల జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ కోరారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ జనార్దన్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆదివారం అందజేశారు. నాయకులు సుబ్బన్న, రామచంద్రారెడ్డి, నగరి శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ-1, 2 పోస్టులను సీనియర్ ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేయాలన్నారు. అలాగే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో లేదా, ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఖాళీగా ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. అనంతరం డీఈఓను ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, అరవింద్, సాంబశివుడు, మధుసూదనరావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి, గోపాలకృష్ణ, రూటా అధ్యక్షుడు షఫీవుల్లా, అబ్దుల్‌కలాం పాల్గొన్నారు.

క్రాస్‌రెగ్యులేటరు నుంచి నీటి విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి ఆదివారం 15,000 క్యూసెక్కులను విడుదల చేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 15,000 క్యూసెక్కులు చేరుతున్నందున, దిగువకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. తెలుగుగంగ(వీబీఆర్)కు 3,000 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్‌కు 10,000, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 2,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని వివరించారు.

నిప్పులవాగుకు 1,057క్యూసెక్కులు విడుదల

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,057క్యూసెక్కులను సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2500క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,403క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. 1,057క్యూసెక్కులు నిప్పులవాగుకు, 312క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు, 34క్యూసెక్కులు ఏబీఆర్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

లయన్స్ సేవలను విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని, సేవా తత్పరత కలిగిన వ్యక్తులను సభ్యులుగా చేర్పించాలని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జేవీసీ ఫంక్షన్ హాల్‌లో నంద్యాల ప్రాంతీయ లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యా, వైద్య, పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. డాక్టర్ రాహుల్, రవికృష్ణ, గెలివి సహదేవుడు, భవనాశి నాగమహేష్, పెసల శ్రీకాంత్, నిజాముద్దీన్, సిరిగిరి రమేష్, నాగరాజు, రాఘవేంద్రరాజు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు


సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రంలో సర్పంచు బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఆదివారం పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీ సుకున్నారు. గ్రామంలో అతిసారం ప్రబలడంతో ప్రధాన రహదారులతో పాటు పలు కాలనీల్లో మురుగు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లారు. అలాగే వైద్య సిబ్బంది కాలనీల్లో కలియ తిరిగి అతిసారంపై సర్వే నిర్వహించారు. అయితే కొత్తగా ఎవరూ అతిసార బారిన పడక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పురస్కార గ్రహీతకు సన్మానం


షేక్షావలిరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఇండోర్ క్రికెట్ స్టేడియంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ పురస్కార అవార్డు గ్రహీత షేక్షావలిరెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎస్‌డీఆర్ విద్యాసంస్థల అధినేత శనివారపు కొండారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు మనోహర్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి అభినందించారు.

నేరాల నియంత్రణకే పల్లెనిద్ర



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్

చాగలమర్రి: గ్రామాల్లో నేరాలను నియంత్రించడానికి పోలీసు శాఖ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తో ందని చాగలమర్రి ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని చిన్నవంగలి గ్రా మంలో పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రా మంలోని ఊరబావి వద్ద గ్రామస్తులను సమావేశపరిచా రు. వారికి నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతి భద్రలకు భంగం వాటిల్లకు ండా గ్రామస్తులందరూ స్నేహభావంతో మెలగాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా పవర్ డిప్లొమో ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిగా డీ2 ఏఈ రామయ్య, జిల్లా అధ్యక్షుడిగా జ్ఞాన సూర్యుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగేశ్వరరెడ్డి, ట్రెజరర్‌గా సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేటి నుంచి శ్రీసత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


ముస్తాబైన శ్రీసత్యమ్మతల్లి ఆలయం

చాగలమర్రి: మండల కేంద్రంలోని ఖల్లాగడ్డ వీధిలో వెలసిన గ్రామ దేవత శ్రీసత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నుంచి 3 రోజులపాటు నిర్వహించనున్నట్లు సత్యమ్మ ఆలయ కమిటీ, గ్రామ రజక సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. గ్రామంలో పూర్వం నుంచి సత్యమ్మ బురుజుగా పేరుగాంచిన స్థలంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో గ్రామ దేవత శ్రీసత్యమ్మ తల్లి విగ్రహాన్ని ఈ నెల 30న ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 11.00 గంటల నుంచి శ్రీసత్యమ్మతల్లి విగ్రహానికి గ్రామోత్సవాన్ని గురువు వీరమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక రజక సోదరీమణులచే కోలాటం ప్రదర్శన ఉంటుందన్నారు. 29న ప్రధాన కలశ స్థాపన, నవగ్రహ తదితర పూజలు, 30న ఉదయం 9.00 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, 9.30 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ అనంతరం కూష్మాండబలి, గోదర్శనం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణతో కార్యక్రమం పూర్తవుతుందని వెల్లడించారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

రెయిలింగ్ ఏర్పాటు చేయండి


కుందూ వంతెనకు రెయిలింగ్ లేని దృశ్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని బ్రాహ్మణపల్లె నుంచి మద్దూరు వైపు వెళ్లే క్రమంలో కుందూ నదిపై ఏర్పాటు చేసిన వంతెనకు రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో వంతెనపై వాహనాలు నడపాలంటే ఆందోళన చెందుతున్నారు. గతంలో అక్కడక్కడ వేసిన ఇనుప కడ్డీలు ఒంగి ప్రమాదకరంగా మారాయి. గ్రిల్స్ లేకపోవడంతో రోజూ ఏదో ఒక సంఘటన జరుగుతూ భయాందోళన కలిగిస్తుందని, అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థికి అభినందన


సుమన్‌ను అభినందిస్తున్న వార్డెన్

నంద్యాల(అర్బన్): స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్లలో ఎంపికైన బీసీ హాస్టల్ విద్యార్థి సుమన్‌ను వార్డెన్ వేణుగోపాల్, హాస్టల్ విద్యార్థులు ఆదివారం అభినందించారు. మూడో సంవత్సరం ఈసీఈ చదువుతుండగానే సుమన్ బెంగుళూరులోని థాట్ వర్క్స్ కంపెనీలో రూ.8 లక్షల ప్యాకేజీతో స్టాఫ్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం సాధించాడు. బీసీ హాస్టల్‌లో ఉంటూ ఉ ద్యోగానికి ఎంపికై.. మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని వార్డెన్ సంతోషం వ్యక్తం చేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై విద్యుత్‌చార్జీల పెంచడానికి ఏపీఈఆర్‌సీకి అనుమతించడంపై సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలను రూ.6,082 కోట్లు ప్రజలపై భారం మోపడానికి విద్యుత్ నియంత్రణ మండలికి అనుమతి ఇవ్వడం తగదన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పారని గుర్తు చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

విద్యుత్ చార్జీలు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు మోపమని చెప్పి 5 నెలలకే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్‌భారం మోపడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


చెకుముకి పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

నంద్యాల(న్యూటౌన్): శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకుంటేనే సమాజం పురోభివృద్ధి వైపు నడుస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు, వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను పట్టణంలోని న్యూక్లియస్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌కు జిల్లాలోని 22 మండలాల నుంచి 46 టీములు పాల్గొన్నాయి. పరీక్షల్లో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రసాదరెడ్డి, ఉదయ్, మహేశ్వరి జిల్లా ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో ఏపీ మోడల్ స్కూల్ పాములపాడు విద్యార్థులు యశ్విని, జ్యోతిక, పల్లవి, నంద్యాల మండల మోడల్ స్కూల్ క్రాంతినగర్ విద్యార్థులు సుమేధా, జ్యోత్స్న, రితిషాలు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో గుడ్‌షెపర్డ్, సుధా, గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలి


ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల కమిటీని ఎన్నుకున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్):జిల్లాలోని ఉపాధి హామీ పథకంలో పని చేసే ఉద్యోగులందరూ ఐకమత్యంతో పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కమిటీ గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్పీజీ కళాశాలలో మనోహర్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా లింగస్వామి, లీగల్ అడ్వైజర్‌గా బాలస్వామి, నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కేజినాయక్, ఉపాధ్యక్షులుగా విమలమ్మ, జనరల్ సెక్రటరీగా ఏసుదాసు, జాయింట్ సెక్రటరీలుగా ప్రసాద్, రాంబాబు, ట్రెజరీగా మోహన్, కో ఆర్డినేటర్ మనోహర్, కల్చరల్ కో ఆర్డినేటర్ గంగన్నను ఎన్నుకున్నారు.